క్లుప్తంగా

ఘనంగా పవిత్రోత్సవాలు



హోమం, పూజలు చేస్తున్న వేద పండితులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆదివారం ఘనంగా జరిపించారు. ఆలయ ధర్మకర్త చారి దంపతుల ఆధ్వర్యంలో యాగశాల అర్చన, అగ్ని ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో అగనంపూడి పరిసర కాలనీల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సాహెబ్ నాయుడు, కృష్ణారావు, గుర్నాథరావు, సోమశేఖర్, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ 3.0లో భాగంగా టౌన్‌షిప్‌లోని సెక్టార్ – 2 షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణ మొత్తాన్ని శుభ్రం చేశారు. అనంతరం సత్యసాయి మందిరం పరిసరాలను పరిశుభ్రం చేసి, అక్కడి వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమంలో పలువురు సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బాపిరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య పాండురంగ విఠల్‌మూర్తి

సీతంపేట: విశాఖ సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం లలితానగర్ లలితా పీఠంలో అడవి బాపిరాజు 128వ జయంతి సభ నిర్వహించారు. ఆచార్య కె.మలయవాసిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి మాట్లాడుతూ బాపిరాజు రచనలపై తన అభిరుచిని, అధ్యయనాన్ని వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ బాపిరాజు జీవిత విశేషాలను వివరిస్తూ, కథకుడిగా, నవలా రచయితగా, కళా దర్శకుడిగా బాపిరాజు బహుముఖ ప్రతిభను విశ్లేషించారు. జాతీయ వాదిగా ఆయన స్థానం మహోన్నతమన్నారు.

ఏళ్ల నాటి కల.. తీరనున్న వేళ

అగనంపూడి, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీవాసులు రైతుబజార్ కోసం పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు మొర పెట్టుకున్నారు. రైతుబజార్ అందుబాటులో లేక దూరప్రాంతాలకు వెళ్లి కూరగాయలు కొనుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుబజార్‌కు అధికారులు స్థలం కేటాయించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఇక్కడ త్వరలో రైతుబజార్ రానుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- రైతు బజార్‌కు స్థలం కేటాయింపుతో నిర్వాసితుల్లో ఆనందం
- జాతీయ రహదారిని ఆనుకుని 60 సెంట్లు మంజూరు



రైతు బజార్ కోసం కేటాయించిన స్థలం

అగనంపూడి: రెండు వార్డుల పరిధికి చెందిన అగనంపూడి, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీవాసుల రైతుబజార్ కల సాకారం కానుంది. ఇక్కడ రైతు బజార్ ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించిన నేపథ్యంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని గత ఏడేళ్ల నుంచి స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ప్రాంతానికి సమీప గ్రామాల్లో గల రైతులు కూరగాయలు పండిస్తున్నా అగనంపూడి వాసులకు మాత్రం రెండు మూడు చేతులు మారితే గాని తాజా కూరగాయలు అందుబాటులోకి రావడం లేదు. అగనంపూడి వారపు సంత నాడు వారానికి సరిపడా కూరగాయలు కొనుక్కోవల్సి వస్తోంది. అలాగే అధిక ధరలు చెల్లించాల్సి రావడంతో ఏళ్ల నుంచి స్థానికులు స్థానికంగా రైతు బజార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

దూరాభారాలు తప్పటంలేదు..

జీవీఎంసీ 79, 85 వార్డుల్లో సుమారు 60 వేల పైచిలుకు జనాభా ఉన్నారు. ఈ ప్రాంతీయులు అనకాపల్లి లేదా గాజువాక మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు తెచ్చుకుంటున్నారు. ఇక్కడి రైతులు కూడా గాజువాక లేదా అనకాపల్లి మార్కెట్‌కు వెళ్లి తమ కూరగాయలు అమ్ముకోవల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో రవాణా చార్జీలతో పాటు కూలి డబ్బులు కూడా కిట్టడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ క్రమంలో అగనంపూడిలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి ద్వారా జిల్లా అధికారులకు పలుమార్లు విన్నవించారు. ఈ క్రమంలో కలెక్టర్ స్పందించి జాతీయ రహదారిని ఆనుకుని అగనంపూడి సర్వే నంబర్ 56లో 60 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. జిల్లా రెవెన్యూ అధికారులు సదరు స్థలాన్ని మార్కెటింగ్ శాఖకు అప్పగించిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు. రైతు బజార్ అందుబాటులోకి వస్తే రైతులకు గిట్టుబాటు ధరతో పాటుస్థానికులకు తాజా కూరగాయలు సరసమైన ధరలకు దొరుకుతాయని స్థానికులు సంబరపడుతున్నారు.



అగనంపూడి కాలనీ ముఖ చిత్రం

స్థలం అప్పగించిన వెంటనే..

అగనంపూడిలో రైతు బజార్ కోసం స్థలం కేటాయించారు. స్థలాన్ని మా శాఖకు అప్పగించిన వెంటనే టెండర్లు పిలిచి రైతు బజార్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

–షేక్ యాసిన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

త్వరలో అందుబాటులోకి రైతుబజార్..

వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సహకారంతో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చొరవతో త్వరలో రైతు బజార్ అందుబాటులోకి వస్తుంది. జాతీయ రహదారిని ఆనుకుని రైతులు, స్థానికులకు అందుబాటులో ఉండేలా స్థలం కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

–జి.పూర్ణానందశర్మ (పూర్ణ), రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

చేనేత ప్రదర్శనకు విశేష స్పందన



చేనేత వస్త్రాలు తిలకిస్తున్న మహిళలు



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన సారాంగాపూర్ వుడ్ ఐటమ్స్

ఉక్కునగరం: స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన చేనేత, హ్యాండీ క్రాఫ్ట్స్ ప్రదర్శనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. భావనా రుషి హస్త కళా కార్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి ఏర్పాటు చేసిన ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వస్తువులను అందుబాటులో ఉంచారు. ప్రదర్శనలో ఉంచిన పోచంపల్లి, నారాయణ పేట, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కళంకారి, ఫ్యాన్సీ చీరలు మహిళలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా కాంతా వర్క్స్ కాటన్, భాగల్‌పూర్ సిల్క్, చాందిని సిల్క్, గుజరాత్ డిజైన్ టాప్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇంటి అందాలను మెరుగు పరిచేందుకు ప్రదర్శనలో ఏర్పాటు చేసిన సారంగాపూర్ వుడ్ ఐటమ్స్ ప్రదర్శన ప్రాముఖ్యతను చాటుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు సింహాద్రి, సురేష్ మాట్లాడుతూ దేశంలోని ప్రతిభావంతులైన కళాకారులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 20 వరకు ప్రదర్శన ఉంటుందని వారు తెలిపారు.

సదస్సులతో నైపుణ్యాభివృద్ధి

అగనంపూడి: సాంకేతిక సదస్సులతో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించ వచ్చని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూధనరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సహకారంతో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై వర్క్‌షాప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దిష్ట పాఠ్య ప్రణాళిక, పాఠ్యాంశానికి సంబంధించి అవగాహతోపాటు నైపుణ్యం రెట్టింపు అవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులు, ప్రయోగాలు, పరిశోధనలకు సంబంధించి ఎన్నో విషయాలపై అవగాహన కలిగించడానికి సదస్సులు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో శ్రీకాంత్, ఈసీఎం విభాగం డీన్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఉద్యోగులు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా వీఎస్ కృష్ణ జయంతి



వీఎస్ కృష్ణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఏయూ క్యాంపస్: డాక్టర్ వీఎస్ కృష్ణ జయంతి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఏయూ డాక్టర్ వీఎస్ కృష్ణ గ్రంథాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్థశాస్త్రం ప్రత్యేక అంశంగా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో వీఎస్ కృష్ణ బీఏ పూర్తి చేశారన్నారు. మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసి 1932లో తనకు ఇష్టమైన విద్యారంగంలో కృష్ణ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. ఏయూలో అర్థశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరిన ఆయన యూజీసీ చైర్మన్‌గా సైతం పని చేశారన్నారు. ఆయన స్మారకంగా గ్రంథాలయానికి డాక్టర్ వీఎస్ కృష్ణ పేరు పెట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేద, యోగా, సంగీత సాధనతో ఆనందమయ జీవితం




విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వెండి నాణేలు అందిస్తున్న అచ్యుతరామయ్య, సత్యదేవ్



కార్యక్రమంలో పాల్గొన్న సంగీత జనకులం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: ఆధునిక సమాజంలో వేద, యోగా, సంగీతపరమైన జీవన విధానం వల్ల సంతోషంగా జీవించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, కంచికామకోటి పీఠం తరఫున వెండి నాణేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఇటీవల కంచికామకోటి పీఠం వారు నగరంలో నిర్వహించిన సంగీత గానఝరి కార్యక్రమంలో సంగీత జనకులం విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రశంసాపత్రాలు, వెండి నాణేలతో సత్కరించినట్లు చెప్పారు. ముఖ్య అతిథి శంకరమఠం కార్యదర్శి టి.అచ్యుతరామయ్య మాట్లాడుతూ కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆదేశంతో జరిపిన సంగీత ఉత్సవంలో నగరంలో సుమారు 2 వేల మంది పాల్గొన్నారన్నారు. ఈ క్రతువులు సంగీత జనకులం పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. సంస్థల సమన్వయంతో ఎన్నో సత్కార్యాలను చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం తరఫున అచ్యుతరామయ్యను డాక్టర్ సత్యదేవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, సంగీత జనకులం అధ్యక్షులు ఇంద్రగంటి కాళీ ప్రసాద్, ఐ.రమణీప్రసాద్, సంస్థ డైరెక్టర్ బి.ఉషారాణి, బాలభాను విద్యాలయం ప్రిన్సిపల్ ఎస్.వి.శుభశ్రీ, డాక్టర్ బాలగణేష్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్కులో తాగునీటి సౌకర్యం



వాకర్స్‌కు తాగునీరు అందిస్తున్న పత్నీరావు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని వాకర్స్ పార్కులో వాకింగ్, సైకిలింగ్‌కు వచ్చిన వారికి ఆదివారం వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు శరగడం పత్నీరావు మినిరల్ వాటర్ అందజేశారు. ఈ పార్కులో తాగునీటి సౌకర్యం లేదు. ఈ సమస్యను వాకర్స్ ద్వారా తెలుసుకున్న ఆయన తన సొంత నిధులతో పార్కులో నిత్యం మినిరల్ వాటర్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పత్నీరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌లను స్ఫూర్తిగా తీసుకుని వార్డులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని చెప్పారు. ఇందులో భాగంగా వాకర్స్‌కు తాగునీటి సౌకర్యం కల్పించానని, వచ్చే వారం పేద చిన్నారులకు పౌష్టికాహారం, పుస్తకాలు పంపిణీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: ప్రజలంతా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 87వ వార్డు పరిధి మీ సేవ వద్ద గల ఫిష్‌మార్కెట్‌లో పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరు ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్స్‌లు, నార సంచులు ఉపయోగించాలని, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని కోరారు. తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చాలని, ఇంకుడు గంతలను తవ్వి భూగర్భ జలాలను సంరక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఏర్పరుచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, పి.ఎస్.ఎన్.రెడ్డి, కామరాజు, వసంతరెడ్డి, మూర్తి, చంద్రకిరణ్, శ్రీరాములు, దిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీరుతో కార్మికుల జీవితాలు బలి



969వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని, కార్మికుల జీవితాలను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 969వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో హెచ్‌ఎంఎస్ యూనియన్ కాంట్రాక్ట్ వర్కర్స్, పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో ప్రభుత్వరంగ సంస్థలను అన్యాయంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపై పోరుకు భెల్ సీఐటీయూ సంఘీభావం



రిలే నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న భెల్ సిటు నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ సంఘీభావం తెలుపుతుందని సిటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. ఆదివారం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర జరుగుతున్న 918వ రోజు రిలే నిరాహార దీక్షలో భెల్ సిటు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటు ప్రధాన కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో స్టీల్‌ప్లాంట్ స్థాపించబడిందని, ఎన్నో ఉద్యమాలతో ఏర్పడిన ఈ కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించరాదన్నారు. స్టీల్ పోరాటానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో భెల్ సిటు నాయకులు కె.విజయ్‌కుమార్, కె.నారపురెడ్డి, కె.పవన్‌కుమార్, జి.అచ్చంనాయుడు, జి.రాంబాబు, పి.శివరాం, ఎస్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహన అవసరం



వృద్ధుల శిక్షణ గైడ్ ఆవిష్కరిస్తున్న గాజువాక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి అప్పారావు

పెదగంట్యాడ: సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహన అవసరమని గాజువాక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ఎం అప్పారావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరులో నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో హెల్ప్ ఏజ్ ఇండియా, ఎల్డర్స్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ శిక్షణ గైడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సీనియర్ సిటిజన్‌కు గుర్తింపు కార్డు అవసరమన్నారు. హెల్ప్ ఏజ్ ఇండియా, ఎల్డర్స్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ మణిదీప్ మాట్లాడుతూ అవగాహన లేక సీనియర్ సిటిజన్స్ తమ హక్కులను, అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్లకు గుర్తింపు కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో బెల్లాల నాగేశ్వరరావు, బొడ్డు కృష్ణారావు, బలిరెడ్డి సత్యనారాయణ, డి.సంపూర్ణం, కులుకూరి శ్రీనివాసరావు, బాబూరావు, సుశీల గజేంద్ర, వరహాలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభం



సత్యదేవునిపై ప్రవచిస్తున్న భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ

దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వారోత్సవాల్లో భాగంగా ప్రముఖ ప్రవచనకర్త, గాన విద్వాంసుడు భాస్కరభట్ల సత్యప్రసాద్‌శర్మ చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో దేవస్థానంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారోత్సవాల్లో కార్యక్రమాలివి..

ధర్మప్రచార వారోత్సవాలు ఈ నెల 14 వరకు నిర్వహించనున్నారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ, హిందూ ధర్మం మరింత వ్యాప్తి చెందేందుకు దేవదాయ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 9న హరికథ, 10న భక్తి సంగీతం, 11న కూచిపూడి నృత్యాలు, 12న భజనలు, 13న కోలాటాలు, 14న పారాయణ నిర్వహించనున్నారు.

వైభవంగా పందిరి రాట మహోత్సవాలు



పందిరి రాట వేస్తున్న మాలినాయుడు దంపతులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి పూజ చేసి పందిరి రాట వేశారు. కార్యక్రమంలో రాకింగ్ యూత్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

62వ వార్డులో..

జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పందిరి రాటను పారిశ్రామికవేత్త మజ్జి మాలినాయుడు దంపతులు వేశారు. కార్యక్రమంలో గణేష్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.